మెచ్చుకోలుగా తలూపాడు సహదేవ్.

"ఆ జాబితాలో కూడా ఏవైనా ఆడ పేర్లు ఉన్నాయేమో గమనించి వాటిమీద ఎక్కువ దృష్టి కేంద్రీకరించండి. ఆపోజిట్ టైప్ ఆఫ్ పర్సనాలిటీ- ఆపోజిట్ సెక్స్ కూడా అయితే ఇంకా ఎక్కువ ఆకర్షింప బడే అవకాశం ఉంది"

"నిజమే.. ఈ ఆలోచన నాకు రాలేదు. అలాగే చేస్తాను. ఇంతకీ నేను మిమ్మల్ని కలిసిన ముఖ్య ఉద్దేశం ఏమిటంటే- ఒక రోజు శివరామన్ మీకు టీవీలో కనిపించాడు అన్నారు కదా? దాని గురించి మరొకసారి చెప్పండి"

"తాజ్‌హోటల్‌లో జరుగుతున్న ఫంక్షన్‌ని కవర్‌చేస్తున్నారు టీవీ వాళ్ళు. న్యూస్ రిపోర్ట్ చేస్తున్న విలేఖరి వెనుక పెద్ద హాల్ ఉంది. దాని నిండా టేబుల్స్ వేసి ఉన్నాయి. వాటి చుట్టూ కొంతమంది వ్యక్తులు కూర్చుని ఉన్నారు. అందులో శివరామన్ ఒకడు అని గమనించాను.."

"అంటే ఏదో క్యాజువల్ విజిటర్ కాదన్న మాట. గ్యారంటీగా హోటల్‌లో రూం తీసుకుని ఉండాలి. అక్కడ వెతికితే అతని అడ్రస్ దొరికే ఛాన్సు ఉంది. నేను ఈ రోజే స్వయంగా ముంబయ్ వెళ్తాను. అక్కడ శివరామన్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తాను"

టైం అయిపోయినట్లు సందేశం వచ్చింది సెంట్రీల నుంచి.

"ఒక విషయం గుర్తు పెట్టుకోండి సర్! మేమంతా మీ వెనుక ఉన్నాం. ఈ పని మీదే ఉన్నాం! మీరు ఏ హత్యా చెయ్యలేదని పూర్తిగా నమ్ముతున్నాం! ధైర్యంగా ఉండండి. అతి త్వరలోనే అన్నీ తప్పక సర్దుకుంటాయి"

అర్థం చేసుకున్నట్లు పాండు చేతిని నొక్కి వడివడిగా నడుచుకుంటూ లోపలకు వెళ్ళిపోయాడు సహదేవ్!

★ ★ ★

పాండు ముంబయ్ బయలుదేరుతుంటే రాజేందర్ వచ్చి క్రితం రోజు పాండు అడిగిన జాబితా ఇచ్చాడు.

అప్పటికే ఫ్లైట్ సమయం దగ్గరవుతోంది. హడావుడిగా బయలుదేరి కారులో కూర్చున్నాడు పాండు.

కారు ఎయిర్‌పోర్ట్ చేరటానికి గంట సమయం పడుతుంది. ఆ సమయం వృథాగా పోనివ్వటం ఎందుకని జేబులో నుండి లిస్ట్ తీసి పరిశీలించటం మొదలుపెట్టాడు.

దాదాపు నలభై పేర్లు ఉన్నాయి అందులో. అన్నిటికీ ఎదురుగా వారి అడ్రస్, ఫోన్ నెంబర్లు ఇవ్వబడి ఉన్నాయి.

అందులో ఆడవారి పేర్లు ఎన్ని ఉన్నాయో లెక్క పెట్టాడు. పదహారు ఉన్నాయి.

ఈ పేర్లన్నీ ఆల్రెడీ డిటెక్టివ్ ఏజన్సీ పరిశీలించిన పేర్లే! అప్పుడు వారికి దొరకని క్లూ.. ఇప్పుడు తనకి మాత్రం ఏమి దొరుకుతుంది? ఏదైనా ప్రత్యేకమయిన ట్రాక్ ఆలోచించి సంభాషించాలి వీరందరితో! అంతేకానీ.. మామూలుగా ఫోన్‌చేసి -'శివరామన్ ఎక్కడ ఉన్నాడో.. తెలుసా?' అంటే ఎవరు చెప్తారు?

కాసేపు ఆలోచించాక సడన్‌గా ఫ్లాష్

అయింది. అవునూ! అసలు శివరామనే ఫోన్ చేస్తున్నట్లు అందరికీ చెప్తే వారి రియాక్షన్ ఎలా ఉంటుంది?

ఐడియా బాగానే ఉన్నట్లుంది. ట్రై చేస్తే పోలా! అనుకుని జాబితా పరిశీలించి అందులో కనిపించిన మొదటి నెంబరుకు ఫోన్ చేశాడు పాండు.

అటు నుండి ఫోన్ ఎత్తుకున్న గొంతు "హలో!" అంది.

"హాయ్ శిల్పా! నేను శివరామన్‌ని మాట్లాడుతున్నాను" లిస్ట్‌లో రాసి ఉన్న ఆమె పేరు చూస్తూ మాట్లాడాడు పాండు.

"శివరామనా..? " సందిగ్ధంగా అంది అటువైపు స్వరం.

"మనం చెన్నయ్‌లో కలిసి చదువు కున్నాం! నేను.. నీ క్లాస్‌మేట్‌ని.."

"ఓహ్! ఆ శివరామనా? " గుర్తువచ్చి నట్లు ఎగ్జయిట్ అయింది శిల్పగొంతు.

"ఎక్కడి నుండి ఫోన్ చేస్తున్నావ్? ఇప్పుడు ఎక్కడ ఉంటున్నావ్? "

అంటే - ఆమెకు శివరామన్ ప్రస్తుత నివాసం గురించి ఏమీ తెలియదన్నమాట. ఇంక ఈ ఫోన్‌కాల్ కొనసాగించటం వలన ఉపయోగం లేదు. కానీ తనే ఫోన్ చేసి అర్ధాంతరంగా కాల్ ఎలా కట్ చెయ్యాలో అర్థంకాలేదు పాండుకి.

"నేను ముంబయ్‌లో ఉంటున్నాను.." ఏదో ఒకటి చెప్పాలి కాబట్టి చెప్పాడు పాండు.

"వెరీ నైస్! నెక్ట్స్ టైమ్ ముంబయ్ వచ్చి నపుడు నీ దగ్గరకు వస్తా! మంచి ట్రీట్ ఇవ్వాలి"

ట్రీట్ ఎందుకడుగుతుందో అర్థంకాలేదు పాండూకి. అతను సమాధానం చెప్పేలోపు మరలా అవతల స్వరమే మాట్లాడింది.

"అన్నట్లు ఇప్పుడు ఎక్కడ పనిచేస్తు న్నావ్? అన్నట్లు మొన్న ఎవరో ఫోన్‌చేసి నీ అడ్రస్ అడిగారు. తెలియదని చెప్పాను.." అంటూ అనర్గళంగా సాగిపో తోంది ఆ సంభాషణ.

ఇక ఈ కాల్ కొనసాగిస్తే తరువాత దానిని ఆపే శక్తి ఎవరికీ ఉండదని అర్థ మయిన పాండు, ఆమె చెప్పేది వినిపించు కోకుండా- "సారీ శిల్పా.. ఇంకొక కాల్ వ స్తోంది. నేను మరలా ఫోన్ చేస్తాను" అని ఫోన్ కట్‌చేసి "ఉఫ్.." అని గట్టిగా నిట్టూర్చాడు.

ఇంతలో ఎయిర్‌పోర్ట్ రావటంతో కారు దిగి టెర్మినల్‌లోకి నడిచాడు.

చెక్ ఇన్ అప్పటికే మొదలయింది. వెళ్ళి బోర్డింగ్ పాస్ తీసుకుని సెక్యూరిటీ చెక్ కూడా పూర్తి అయ్యాక, లాంజ్‌లోని సోఫాలో కూర్చుని మరలా లిస్ట్ తీశాడు.

అందులో మరొక అమ్మాయి పేరు చూసి ఫోన్ చేశాడు.

"హలో.." అప్పుడే నిద్రలేచినట్లు బద్ధ కంగా వినిపించింది అవతలివైపు గొంతు.

"హలో.. నేను శివరామన్‌ని మాట్లాడు తున్నాను.."

అతని మాటలు పూర్తికాకముందే.. అవ తల పక్క స్వరంలో తీవ్రత హెచ్చింది- "ఎక్కడ చచ్చావ్ ఇప్పటిదాకా? ఆర్డరిచ్చిన పిజ్జా ఏమయింది? ట్రాఫిక్‌లో ఇరుక్కు న్నానని మాత్రం చెప్పకు.."

ఈ పిజ్జాగోల ఏమిటో అతనికి ముందు అర్థంకాలేదు. కానీ ఆమె తనను పిజ్జా సర ఫరా చేసే బాయ్ అనుకుంటుందని నెమ్మ దిగా అర్థమయింది.

"..అదికాదు ప్రీతీ! నేను పిజ్జాబాయ్‌ని కాదు.. నీ క్లాస్‌మేట్ శివరామన్‌ని.." అని వివరించాడు, అంతకంటే ఏమి చెప్పాలో అర్థంకాక.

"ఓహ్.. నువ్వా? " విసుగ్గా అంది ప్రీతి.

"శివరామన్ అంటే.. లీన్ అండ్ బ్లాక్ చాప్.. అవునా? " కన్ఫర్మ్ చేసుకోవటానికి అన్నట్లు అడిగింది.

నిజం శివరామన్ అయితే ఏమి చేసేవాడో కానీ.. పాండు మాత్రం, “అవును” అని ఊరుకున్నాడు.

“అప్పట్లో మూతిమీద మీసం, నోట్లో నాలుకా రెండూ ఉండేవి కాదుగా? ఇప్పుడేమిటి ధైర్యంగా నాకే ఫోన్ చేశావ్? ”

“ఈ మధ్య శిల్ప ఫోన్‌చేసి నీ నెంబర్ చెప్పింది. ఒకసారి పలుకరిద్దామని..”

“పలుకరించేదేంటిరా బడుద్ధాయ్! ఫోన్ పెట్టు! పిజ్జావాడు ట్రై చేస్తూ ఉండి ఉంటాడు..” అంటూ కట్ చేసింది.

ఇంతలో ఫ్లైట్ బయలుదేరుతుందన్న ఎనౌన్స్‌మెంట్ వినిపించింది. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి లోపలకు నడిచాడు.

మరొక గంట తరువాత ముంబయ్‌లో దిగాడు అతను.

బయటకు వచ్చి టాక్సీలో కూర్చుని తాజ్ హోటల్‌కు పోనివ్వమని చెప్పి మరలా ఫోన్ ఆన్ చేశాడు.

ముచ్చటగా మూడోసారి మరొక నెంబర్ ప్రయత్నించాడు.

“అల్లంత దూరాన ఒక గాడిద.. సెల్ ఎదుట నిలిచింది నీ తీరుగా.. అరుదయిన చింపాంజీలా.. కొవ్వెక్కిన దున్నపోతులా..” శ్రుతి బద్ధంగా పాట వినిపించింది.

తరువాత ఫోన్ ఎత్తిన యువతి గొంతు అల్లరిగా వినిపించింది “హలో.. ఎలా ఉంది పాట? ఇప్పుడే పెట్టాను”

అదేమీ పట్టించుకోనట్లు అతను “హలో మంజూ.. నేను శివరామన్‌ని”

“సో వాట్? అదేదో నేను ఒబామాని అన్నంత ధీమాగా చెప్తున్నావ్? నువ్వెవడయితే నాకేంటి? మర్యాదగా నేను అడిగిన దానికి సమాధానం చెప్పు! పాట ఎలా ఉంది? ”

“నీ మొహంలాగా ఉంది..” అని ఫోన్ పెట్టేశాడు పాండు.

ఇప్పుడర్థమయింది అతనికి డిటెక్టివ్‌ల పని ఎంత కష్టమో!

ఇంతలో టాక్సీ తాజ్ హోటల్ సమీపించింది.

పాండు దిగి హోటల్‌లోకి నడిచాడు.

ముందే రిజర్వ్ చేసుకున్న రూమ్ వెంటనే అతనికి అలాట్ అయింది. కీ చేతిలోకి తీసుకున్న రూమ్ బాయ్ ‘ఇటు రండి సర్!’ అంటున్నాడు దారి చూపిస్తూ!

అయితే పాండు అతన్ని అనుసరించకుండా ఆగిపోయాడు. సంశయిస్తూనే రిసెప్షనిస్ట్‌ని అడిగాడు- “ఒక చిన్న ఇన్ఫర్మేషన్ కావాలి..”

“చెప్పండి సర్.. ఏం కావాలి? ”

“తాజ్ హోటల్ మరలా ఓపెన్ చేసింది ఏ రోజు? ”

చెప్పాడతను ఆశ్చర్యం అణచుకుంటూ!

“ఆ రోజు మా ఫ్రెండ్ ఒకతను ఈ హోటల్‌లో దిగాడు. అతని పేరు చెప్తాను. అడ్రస్ చెప్పగలరా!”

“సారీసర్! కస్టమర్ కాన్ఫిడెన్షియాలిటీ!”

“ఈ విషయం తెలుసుకోవటానికి మరో మార్గం లేదా? ”

“సారీ సర్..”

“నో ప్రాబ్లమ్..” అంటూ తన రూమ్ వైపు వెళ్ళిపోయాడు అతను.

రూమ్‌లో లగేజ్ పెడుతున్న రూమ్ బాయ్‌కి టిప్ ఇస్తూ అదే ప్రశ్న మరలా అడిగాడు.

“మా కస్టమర్ రిలేషన్స్ మేనేజర్ని కలవండి సర్.. ఆయన మీకు సహాయం చెయ్యవచ్చు.” చెప్పాడతను.

“ఎక్కడ ఉంటారు ఆయన? ”

ఆయన ఆఫీసు ఎక్కడ ఉందో చెప్పాడు అతను.

పాండుకి ఆ మేనేజరయినా తనకు కావలసిన వివరాలు ఇస్తాడన్న నమ్మకం లేదు. అయినా ఆ మార్గం మాత్రం ప్రయ

త్నించకుండా వదిలి పెట్టడం ఎందుకని అతన్ని కలవటానికే నిర్ణయించుకున్నాడు.

"ఇప్పుడుంటారా ఆయన ఆఫీసులో? "

టైము చూసి- "మరొక అరగంట ఆగి వెళ్ళండి సర్! ఇప్పుడు ఆయనకు లంచ్ టైమ్.." చెప్పాడు బాయ్.

ఈ లోపు ఖాళీగా ఉండటం ఇష్టంలేక మరొక రెండు ఫోన్ కాల్స్ చేశాడు. కానీ ఉపయోగకరమయిన వివరాలేమీ వాటివలన తెలియలేదు.

మేనేజర్ ఆఫీసు గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉంది. పాండు వచ్చిన పని వినగానే.. అతని మొహంలో నిరాశ కనిపించింది.

"సాధారణంగా కస్టమర్ అడిగిన ఏ కోరికకూ.. లేదు, కాదు అని చెప్పటం నాకు ఇష్టం ఉండదు. కానీ ఇలా ఒక కస్టమర్ వివరాలు మరొకరికి చెప్పటం తప్పు. అందులో ఇప్పుడు సెక్యూరిటీ మరీ కఠినంగా ఉంది.."

ఆయన మాటలను మధ్యలోనే అడ్డుకున్నాడు పాండు.

"మీరిచ్చిన వివరాలు దుర్వినియోగం చెయ్యదలుచుకుంటే ఈ విధంగా సరాసరి మీ దగ్గరకు రాను. పైగా పూర్తి వివరాలు చెప్పలేను. కానీ ఈ పని చెయ్యటం ద్వారా మీరు ప్రభుత్వానికి సహకరిస్తున్నారు"

అతను కాసేపు ఆలోచించి - "ఏమి పేరు అన్నారు? " అన్నాడు.

పాండు చెప్పిన వివరాల ప్రకారం అతను తన కంప్యూటర్లో సెర్చ్ చేశాడు.

"సారీ సర్.. ఆ పేరుగల వ్యక్తి ఏ రూమూ బుక్ చేసినట్లు మా రికార్డుల్లో లేదు.."

అప్పుడు పాండు అతనికి తాము వెతుకుతున్న వ్యక్తి టీవీలో ఈ హోటల్‌లో ఉన్నట్లు కనపడటం గురించి చెప్పాడు.

"అతను హోటల్‌లో జరుగుతున్న ఫంక్షన్‌కి అటెండ్ అయి ఉండవచ్చు. లేదా ఆ రోజు ఏదన్నా కాన్ఫరెన్స్ లాంటిది హోటల్లో జరుగుతుంటే దానిలో పాల్గొనటానికి వచ్చి ఉండవచ్చు. అతను హోటల్ లాబీలో కనిపించినంత మాత్రాన హోటల్లో రూమ్ తీసుకుని ఉండవలసిన అవసరం లేదు"

"ఐసీ.." ఆలోచిస్తున్నట్లు అన్నాడు పాండు.

"పోనీ ఆ రోజు ఈ హోటల్లో ఏదన్నా రియల్ ఎస్టేట్‌కి సంబంధించి కాన్ఫరెన్స్ జరిగిందేమో చూడగలరా? " అన్నాడు.

మేనేజర్ మరలా కంప్యూటర్లో వెతికాడు.

"లేదు.. అలాంటిదేమీ లేదు. స్పోర్ట్స్‌కి సంబంధించిన కాన్ఫరెన్స్ ఒకటి, గులాబీ పూల ఎగుమతికి సంబంధించిన కాన్ఫరెన్స్ ఒకటి జరిగింది. అంతే తప్ప రియల్ ఎస్టేట్‌కి సంబంధించి ఎలాంటి సమావేశం ఈ హోటల్లో జరగలేదు"

"థాంక్యూ.." అంటూ నిరాశగా లేచి నిలబడ్డాడు పాండు.

"ఇంకేదన్నా సహాయం అవసరం అయితే చెప్పండి సర్! ఉయ్ ఆర్ ఎట్ యువర్ సర్వీస్.."

"అలాగే.." అని తిరిగి తన రూమ్‌కు చేరుకున్నాడు.

ఇంకేవిధంగా ముందుకు వెళ్ళాలో అతనికి అర్థం కాలేదు.

ఇంతలో హైదరాబాద్ నుండి కెప్టెన్ రాజేందర్ ఫోన్ వచ్చింది.

"సార్ కచ్చితంగా చెప్పలేము కానీ... శివరామన్ ముంబయ్‌లో ఉండే ఛాన్సు ఎక్కువ కనిపిస్తుంది. అతని ఒకరిద్దరు పాత స్నేహితులు అదే సూచించారు. అందుకే నేను మరొక అసిస్టెంట్‌ను తీసుకుని ముంబయ్ వస్తున్నాను."

"రండి! ఒకరికంటే ఎక్కువ మంది ఉంటే కొన్ని కొత్త ఆలోచనలు రావచ్చు."